క్లుప్తంగా

నేడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో 'స్పందన'

నూజివీడు: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొని తమ సమస్యల పరిష్కారం నిమిత్తం అర్జీలను అందజేయాలని పేర్కొన్నారు. స్పందనలో ఇచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

గంపలగూడెంలో..

గంపలగూడెం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి తెలిపారు. మండల స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొనే కార్యక్రమంలో ప్రజలు తమ సమస్యలపై ఫిర్యాదులు అందజేయవచ్చని పేర్కొన్నారు.

చాట్రాయిలో..

చాట్రాయి: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ విశ్వనాథరావు కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పాల్గొంటారని, అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేయాలని కోరారు.

31లోగా ఆస్తి పన్ను బకాయిలు చెల్లించండి

నూజివీడు: పట్టణంలోని ఆస్తి పన్ను బకాయిదారులు ఈ నెల 31వ తేదీ లోగా బకాయి మొత్తాన్ని ఒకేసారి చెల్లించినట్లయితే వడ్డీని మాఫీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్ ఆదివారం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పన్ను బకాయిలపై వడ్డీ రాయితీని ప్రకటిస్తూ జీఓ జారీ చేసిన నేపథ్యంలో పట్టణంలోని ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. అలాగే యజమానులు తమ ఆస్తి పన్నును ప్రతి ఏటా మాదిరిగానే ఈ ఏడాది పన్నును కూడా ఈ నెల 31లోగా చెల్లించాలని కోరారు.

విజేతలకు బహుమతులు అందజేత



రెడ్డిగూడెం: స్థానిక సీఎస్ఐ చర్చి ఆవరణలో సంఘస్తులకు కబడ్డీ, రింగ్, క్యారమ్స్ పోటలను నిర్వహించినట్లు శ్రీ మన్నె శ్రీ మెమోరియల్ సర్వీసు సొసైటీ సెక్రటరీ మన్నె కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన్నే జయకుమార్ ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. విజేతలకు సీఎస్ఐ సంఘ కాపరి రెవ. జి విశ్వనాతం బహుమతులు అందజేశారు.

బాబోయ్ కుక్కలు..!



తోలుకోడు(మైలవరం): మండలంలోని తోలుకోడు, మైలవరం, పుల్లూరు, చంద్రాల తదితర గ్రామాల్లోని ప్రధాన రహదారుల్లో కుక్కలు సంచరిస్తూ పాదచారులను, వాహన చోదకులను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నాయి. మైలవరంలో వాహన చోదకుల వెంట పడుతుండడంతో వారు బెంబేలెత్తిపోతున్నారు. ఉదయం కార్యాలయాలకు, పిల్లలు పాఠశాలలకు వెళ్లాలన్నా కుక్కలు వెంటపడుతుండటంతో భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలను బడికి పంపాలంటే తప్పనిసరిగా పెద్దలు పనులు మానుకుని తీసుకువెళ్లాల్సి వస్తోందని, తోలుకోడు గ్రామానికి చెందిన ఐ.వెంకటరత్నం తెలిపాడు. గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల వాసులు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి రాకతో కార్యకర్తల్లో జోష్



తిరువూరు సభకు విచ్చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పూలు చల్లుతూ స్వాగతం పలుకుతున్న అభిమానులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి కేరింతలు కొడుతున్న విద్యార్థులు

తిరువూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి తిరువూరు రాకతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో నూతనోత్సాహం చోటు చేసుకుంది. జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమం ఆదివారం తిరువూరులో జరిగింది. ఈ సభకు పలు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. వాహినీ ఇంజినీరింగ్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు ఉదయం 11 గంటలకు చేరుకున్న ముఖ్యమంత్రి సుగాలీ కాలనీ, బైపాస్‌రోడ్, మండల పరిషత్ రోడ్, బోస్ సెంటర్, ఫ్యాక్టరీ సెంటర్, విఘ్నేశ్వరాలయం, మార్కెట్‌యార్డు మీదుగా 12 గంటలకు సభావేదికకు విచ్చేశారు. దారి పొడవునా అభిమానులు, కార్యకర్తలు పూలు చల్లుతూ ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. సభా ప్రారంభానికి ముందు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కొద్దిసేపు ముచ్చటించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాదీవెన నిధుల విడుదలలో ఏమైనా ఇబ్బందులున్నాయా, కాలేజీ యాజమాన్యాలు ఇబ్బందులు పెడుతున్నాయా అని ఆరా తీశారు. ఎటువంటి సమస్య ఉన్నా తనను నేరుగా సంప్రదించవచ్చని, 1902 నంబరుకు ఫోన్ చేస్తే తానే కళాశాల యాజమాన్యాలతో మాట్లాడతానని కూడా ముఖ్యమంత్రి వారికి హామీ ఇచ్చారు. తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి, జిల్లా కలెక్టర్ ఢిల్లీ రావు ముఖ్యమంత్రికి జ్ఞాపిక బహూకరించారు. సభలో గంటసేపు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగం పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నింపింది.

ఆయన మాట్లాడుతున్నంత సేపు సభలో కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు కరతాళ ధ్వనులు చేస్తూ, 'సీఎం, సీఎం..' అంటూ నినాదాలు చేశారు. మరో రెండేళ్లలో అన్ని ప్రభుత్వ పాఠశాలలనూ కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా రూపురేఖలు మారుస్తానని, నూతన విద్యావిధానంలో భాగంగా బైజూస్ ట్యాబ్‌లను 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చామని, అన్ని తరగతుల్లో డిజిటల్ విద్యావిధానం అమలు చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించగా, విద్యార్థులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు.



సీఎం సభకు హాజరైన జనసందోహంలో ఓ భాగం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న తిరువూరు ఎమ్మెల్యే కె. రక్షణనిధి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఉత్సాహంగా ఈల వేస్తున్న అభిమాని

ప్రతి పౌర్ణమికి అరుణాచలానికి బస్

నూజివీడు: అరుణాచలం పుణ్యక్షేత్రానికి నూజివీడు నుంచి ప్రతి పౌర్ణమికి ముందు రోజు సూపర్‌లగ్జరీ బస్సు సర్వీసును నడుపుతున్నట్లు డిపో మేనేజర్ సీహెచ్ సూర్యపవన్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దలకు టికెట్ ధర రూ.2,600, ఆన్‌లైన్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చన్నారు. ఈ సర్వీసులో భాగంగా శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురంలను దర్శనం చేసుకుని అరుణాచలం చేరుతుందన్నారు. ఏప్రిల్ 4, మే 3, జూన్ 2, జులై 1 తేదీల్లో నూజివీడు నుంచి బస్సు సర్వీసు బయలుదేరుతుందన్నారు. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం శ్రీరాముని కల్యాణానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం శ్రీరామనవమి ముందు రోజు నుంచి నూజివీడు డిపో ఆధ్వర్యంలో బస్సు సర్వీసులు నడపనున్నట్లు డిపో మేనేజర్ తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం విజ్ఞప్తి చేశారు.





తిరువూరులో జగనన్న విద్యాదీవెన పంపిణీ సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సభకు విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న తిరువూరు, నూజివీడు ఎమ్మెల్యేలు కె.రక్షణనిధి, మేకా వెంకటప్రతాప్ అప్పారావు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

గుండెల నిండా జగన్మోహనుడే

తిరువూరు: తన అభిమాన నేత చిత్రాన్ని గుండెలపై పచ్చబొట్టు పొడిపించుకున్న వీరాభిమాని తిరువూరులో ఆదివారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్న జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల కార్యక్రమంలో సందడి చేశాడు. నూజివీడులో తాపీ పని చేసుకునే బాలు అనే యువకుడు సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు.



పచ్చబొట్టు పొడిపించుకున్న బాలు

కట్టెలేరు వంతెనకు మోక్షం

వినగడప(గంపలగూడెం): మండలంలోని వినగడప వద్ద కట్టెలేరు పై వంతెన నిర్మాణం గతంలో కేవలం హామీలకే పరిమితం కాగా, ఆదివారం తిరువూరు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన లో బ్రిడ్జి కారణంగా తరచూ వాగుకు వచ్చే వరదలతో వాహనాల రాకపోకలు నిలిచిపోయి 40 గ్రామాల మధ్య రవాణా నిలిచిపోతుండేది. నాలుగు సంవత్సరాల క్రితం వంతెన పూర్తిగా కూలిపోయింది. గత ప్రభుత్వంలో వంతెన పునర్నిర్మాణానికి పలుమార్లు ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాకపోవడం గమనార్హం. ప్రస్తుతం ఈ వంతెనకు ఏర్పాటు చేసిన డైవర్షన్ రహదారిపైనే ఏడాది కాలంగా రాకపోకలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఎమ్మెల్యే రక్షణనిధి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైలెవెల్ వంతెనకు రూ.26కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. మండల ప్రజలు ముఖ్యమంత్రి ప్రకటనతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వినగడప వద్ద కట్టెలేరుపై కొట్టుకుపోయిన వంతెన

గాలివాన బీభత్సం


చాట్రాయి: ద్రోణి ప్రభావంతో మండలంలోని పోతనపల్లి గ్రామంలో శనివారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్కసారిగా అత్యంత వేగంతో గాలి వాన రావడంతో పలు రకాల పంటలు నేలవాలాయి. చెట్లు కూలి బాణావతు రత్తమ్మ, బోగోలు సావిత్రి గృహాలపై పడ్డాయి. గోగుల రాధాకృష్ణ ఇంటి రేకులు లేచిపోయాయి. నాలుగు విద్యుత్ స్తంభాలు, రెండు ట్రాన్స్‌ఫార్మర్లు విరిగి పడడంతో సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లింది. రాత్రంతా గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఉదయం విరిగిన స్తంభాలు, తెగిన విద్యుత్ వైర్లను తొలగించి మరమ్మతులు పూర్తి చేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖ ఏఈ సంజయ్ చెప్పారు. బాణావతు మంచాకు చెందిన 12 పామాయిల్ చెట్లు, ధారావతు నాగులుకు చెందిన మూడు ఎకరాలు, లావూరి నాగులుకు చెందిన 2 ఎకరాలు, చలపతికి చెందిన 2 ఎకరాలు, వెంకన్నకు చెందిన 2 ఎకరాల్లో మొక్కజొన్న నేల వాలింది. దారావతు చలపతి చెందిన మామిడికాయలు రాలిపోయాయి.

భారీ వర్షం

గంపలగూడెం: మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టెలేరులో వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కాగా కల్లాల్లో అరబెట్టిన మిరపకాయలను పరదాలు కప్పి తడవకుండా చేసేందుకు రైతులు నానా తంటాలు పడ్డారు.

వర్షంతో దెబ్బతిన్న పంటలు

మైలవరం: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రాత్రి కురిసిన వర్షానికి మొక్కజొన్న, వరి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 250 ఎకరాలు వరకు మొక్కజొన్న పంట నేలకు ఒరిగిందని మండల వ్యవసాయశాఖ అధికారి సంధ్యారాణి తెలిపారు.



కట్టెలేరులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు



అక్కిరెడ్డిగూడెంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న సిబ్బంది

వర్షాలకు దెబ్బతిన్న పంటల పరిశీలన

ముసునూరు: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసిన, నేలకొరిగిన పొగాకు, మొక్కజొన్న, మిర్చి పంటలను వ్యవసాయశాఖ క్షేత్ర స్థాయి సిబ్బంది పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో వ్యవసాయాధికారి సీహెచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్‌బీకేల క్షేత్ర స్థాయి సిబ్బంది ఆదివారం పంటలను పరిశీలన చేసి, నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 365 ఎకరాల్లో పొగాకు, 154 ఎకరాల్లోని మొక్కజొన్న, ఎనిమిది ఎకరాల్లో మిర్చి పంట దెబ్బతిన్నట్లు తెలిపారు. ప్రాథమిక నివేదికను ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు.

పరిహారం ఇవ్వాలి

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ 800 మెగావాట్ల నిర్మాణ ప్లాంటులో జరిగిన ప్రమాదంలో మృతుల కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని ఎంసీపీఐయూ ఉమ్మడి కృష్ణా జిల్లా కార్యదర్శి గొల్లపూడి ప్రసాద్ కోరారు. ఇబ్రహీంపట్నం కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ జార్ఖండ్ రాష్ట్రం నుంచి ఉపాధి కోసం వచ్చిన జితేంద్రసింగ్, చోటూ కుమార్‌సింగ్ విధి నిర్వహణలో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున పరిహారం చెల్లించి కుటుంబంలో ఒకరికి జీవనోపాధి మార్గం చూపించాలని కోరారు.

శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు





విజయవాడ రోడ్డులో హెచ్‌ఓ ల్యాండ్‌లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఇళ్లు

ఆగిరిపల్లి: పేదవాడి సొంతింటి కల సాకారం చేసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారు. ఇళ్లు కట్టుకునేందుకు సెంటు భూమి లేక ఇన్నాళ్లు అద్దె ఇళ్లలో ఉండే వారికి జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి సెంటున్నర స్థలం ఉచితంగా ఇవ్వడమే కాక ఇల్లు నిర్మించుకునేందుకు ఆర్థికంగా చేయూతనిచ్చారు. మండలంలో 2,662 మందికి సెంటున్నర చొప్పున స్థలాలు పంపిణీ చేశారు. ఈ స్థలాల్లో లబ్ధిదారులు తమ ఇళ్లను అద్భుతంగా నిర్మించుకుంటున్నారు. ఇప్పటివరకు 1,500 మంది వరకు ఇంటి నిర్మాణాలు ప్రారంభించారు. స్థానిక విజయవాడ రోడ్డులో గల సాయిబాబా మందిరం వద్ద గల హెచ్‌ఓ ల్యాండ్‌లో ఆగిరిపల్లికి చెందిన లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చారు. సుమారు 100 మంది ఇళ్ల నిర్మాణం చేపట్టగా, 50 శాతం మంది శరవేగంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు.

క్షీరబంధు నగదు అందజేత

రెడ్డిగూడెం: మండలంలోని ముచ్చనపల్లి పాల సంఘంలో పాల ఉత్పత్తిదారుడైన గుమ్మడి కృష్ణారావు ఇటీవల మృతి చెందాడు. క్షీరబంధు పథకం కింద మంజూరైన రూ.50వేలను తిరువూరు పాల శీతల కేంద్రం మేనేజర్ టి. సాంబమూర్తి, సంఘం అధ్యక్షుడు ఆముదాల సాంబశివరావు ఆదివారం కృష్ణారావు భార్య దమయంతికి అందజేశారు.

మల్లు స్వరాజ్యానికి ఘన నివాళి



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): స్వాతంత్ర్య సమర యోధురాలు, మాజీ ఎమ్మెల్యే మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతిని ఐద్వా సంఘం కొండపల్లిలో ఆదివారం నిర్వహించారు. ఐద్వా మండల అధ్యక్షురాలు బేబీ సరోజినీ మహిళలతో కలిసి ఆమె చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. ఐద్వా మండల కార్యదర్శి పార్వతి, సభ్యులు వెంకటరమణ, స్వరూపరాణి పాల్గొన్నారు.

త్రిశక్తి పీఠంలో దక్షిణామూర్తి హోమం

కృష్ణలంక(విజయవాడతూర్పు): పదో తరగతి, ఇంటర్ విద్యార్థుల పరీక్షా సమయాన్ని దృష్టిలో ఉంచుకుని బస్టాండ్ సమీపంలోని శ్రీ కాశీ మాత అమ్మవారి దేవస్థానం(త్రిశక్తి పీఠం)లో ఆదివారం శ్రీసరస్వతీ సహిత మేధా దక్షిణామూర్తి హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో విద్యార్థులు సరస్వతీ దేవికి పూజలు చేశారు. అనంతరం పూర్ణాహుతి జరిగింది.

భారీగా తరలివచ్చిన జనం

గంపలగూడెం: తిరువూరులో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు వివిధ గ్రామాల నుంచి అధిక సంఖ్యలో మహిళలు, అభిమానులు తరలివచ్చారు. గంపలగూడెం మండలం నుంచి 150కు పైగా బస్సులు, ఇతర వాహనాల్లో, ద్విచక్రవాహనాలపై పార్టీ జెండాలు చేతబూని ఉత్సాహంగా సీఎం సభకు తరలివచ్చారు.

తరలివెళ్లిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీకి చెందిన విద్యార్థులు ఆదివారం తిరువూరులో నిర్వహించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు తరలివెళ్లారు. వీరంతా విద్యాదీవెన, వసతిదీవెన పథకంలో లబ్ధిపొందుతున్న వారే. విద్యాదీవెన, వసతిదీవెన నిధుల విడుదల కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొని నిధులను విడుదల చేస్తున్న నేపథ్యంలో ట్రిపుల్ ఐటీకి చెందిన 2,738 మంది విద్యార్థులు తిరువూరు వెళ్లారు.

చాట్రాయి నుంచి..

చాట్రాయి: తిరువూరులో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు రాష్ట్ర కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, మండలంలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు భారీగా తరలివెళ్లారు.



గంపలగూడెం మండలం కొణిజర్ల నుంచి బయల్దేరిన వైఎస్సార్ సీపీ శ్రేణులు

విస్సన్నపేట నుంచి..

విస్సన్నపేట: తిరువూరులో ఆదివారం జరిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభకు మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, విద్యార్థులు భారీగా తరలివెళ్లారు. ఏఎంసీ మాజీ చైర్మన్ సూర్యనారాయణరెడ్డి, ఎంపీపీ పిల్లి మెర్సీ వనజాక్షి, జెడ్పీటీసీ సభ్యుడు భీమిరెడ్డి లోకేశ్వరరెడ్డి, విస్సన్నపేట సర్పంచ్ నాగమల్లేశ్వరి, కేడీసీసీబీ డైరెక్టర్ భూక్యా రాణి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు సిరసాని ప్రకాష్ తదితరులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

ఎ.కొండూరు నుంచి..

ఎ.కొండూరు: మండలంలోని చీమలపాడు, ఏ.కొండూరు, కంభంపాడు, రామచంద్రాపురం, రేపూడి, గొల్లమండల, పోలిశెట్టిపాడు, కోడూరు, కృష్ణారావుపాలెం పలు గ్రామాల నుంచి ఆదివారం తిరువూరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యాదీవెన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు వందలాది మంది బస్సులలో తరలివెళ్లారు.



సీఎం సభకు బస్సుల్లో తరలివెళుతున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు



గంపలగూడెం మండలం తునికిపాడు నుంచి ప్రత్యేక వాహనంలో అభిమానులు



గంపలగూడెం మండలం అనుముల్లంక నుంచి సీఎం సభకు తరలిన అభిమానులు